


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 28 | మార్చి | 2026 ◆ పేజీలు : 8


# భద్రాద్రి రామయ్యకు నేడు శ్రీరామ మహా పట్టాభిషేకం

- పట్టు వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**భద్రాచలం, మార్చి 27, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీరామ మహా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం నిర్వహించే ఈ ఉత్సవం ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీరామ మహా పట్టాభిషేకం సందర్భంగా స్వామివారికి ఆభరణాలతో పాటు రాజ దండం, రాజముద్రిక, చత్రం, శంఖం, చక్రం, కిరీటం తదితర రాజ

మిగతా 2 లో...



- దక్షిణ అయోధ్యలో దివ్య దాంపత్య దృశ్యం
- కనువిందైన సీతారాముల కళ్యాణ వైభవం
- సాంప్రదాయ బద్ధంగా ముగిసిన కళ్యాణ తంతు
- ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు
- రూ.351 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వేడుకలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, పలువురు రాష్ట్ర మంత్రులు
- భక్తులతో పోటెత్తిన భద్రగిరి
- భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



# అభిజిత్ లగ్నంలో... ఆధ్యాత్మిక వైభవం

3 లో..

# గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం ఆలయ తొలి దశ పనులు పూర్తి

- రూ.351 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం – మంత్రి కొండా సురేఖ వెల్లడి

**భద్రాచలం, మార్చి 27, ప్రజా జ్యోతి:** గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భద్రాచలంలోని సీతారాముల కళ్యాణానికి దేశవ్యాప్తంగా విశేష ప్రాముఖ్యత ఉందని, కోట్లాది మంది భక్తులు ఈ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీక్షిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సంవత్సరం మంత్రిగా




మిగతా 2 లో...

# నేడు 'భద్రగిరి మార్ట్' ప్రారంభం

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- గిరిజన మహిళల ఉత్పత్తులకు వేదిక.. పౌష్టికాహారం, ఆర్గానిక్ సరుకులు లభ్యం
- ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ వెల్లడి



**భద్రాచలం టౌన్ మార్చి 27 ప్రజా జ్యోతి** భద్రాచలం పట్టణం ప్రజలకు మరియు ఆదివాసి గిరిజన గ్రామాలలోని ప్రజలకు గిరిజన మహిళలు స్వతహాగా తయారు చేసే పౌష్టికారమైన ఆహార పదార్థాలతో పాటు ఆర్గానిక్ సంబంధించిన నిత్యవసర సరుకులు సరసమైన ధరలకు అందించడానికి భద్రాచలం పట్టణంలో నెలకొల్పిన భద్రగిరి మార్ట్ శనివారం రోజు తెలంగాణ రాష్ట్రగవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఐటిడిఏ

మిగతా 2 లో...

## గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం ఆలయ తొలి దశ పనులు పూర్తి

(మొదటి పేజీ తరువాయి...)


ఈ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవసరమైన భూసేకరణ పూర్తి చేసిన అనంతరం రూ.351 కోట్లతో తొలి విడత అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన అభివృద్ధి పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. అనంతరం రెండో విడత నిధులు విడుదల చేసి, కృష్ణ పుష్కరాల నాటికి మొత్తం అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులందరికీ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని మంత్రి కోరారు. ప్రజా ప్రభుత్వానికి శక్తిని ప్రసాదించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దేవుని ఆశీర్వాదం ఉండాలని ప్రార్థించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నేడు శ్రీరామ మహా పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి...)

లాంఛనాలు ధరింపజేస్తారు. ఈ ఉత్సవాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వీక్షిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరుకానున్నారు. ఆయన ముందుగా భద్రాచలం చేరుకుని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మిథిలా స్టేడియంలో జరిగే పట్టాభిషేక కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. మహా పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కళ్యాణ మండపం వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే మహా పట్టాభిషేకంలో గవర్నర్ పాల్గొనే సంప్రదాయానికి మాజీ గవర్నర్ ఈ.ఎస్.ఎల్. నరసింహన్ శ్రీకారం చుట్టారు. అత్యధిక సార్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఈ మహా పట్టాభిషేకం సందర్భంగా భద్రాచలం క్షేత్రం భక్తులతో కళకళలాడనుంది.

## నేడు 'భద్రగిరి మార్ట్' ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి...)

ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు సాయంత్రం యూనిటీ అధికారులతో కలిసి భద్రగిరి మార్ట్ ను ఆయన సందర్శించి గిరి మార్ట్ లో నిత్యవసర సరుకులను మరియు ఆర్గానిక్ సంబంధించిన వివిధ రకాల సామాన్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయి ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, సేంద్రీయ ఎరువులతో పండించిన ఉత్పత్తులు మరియు ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు తయారుచేసిన నాణ్యత గల ఇతర పదార్థాలు సరసమైన ధరలకు ప్రజలకు అందించడానికి భద్రగిరి మార్ట్ ను ప్రారంభిస్తున్నామని, ఈ సువర్ణ అవకాశాన్ని గిరిజన గ్రామాలలోని ప్రజలు పట్టణ ప్రజలు అధిక సంఖ్య లో భద్రగిరి మార్ట్ ను సందర్శించి ఆరోగ్యకరమైన మీకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసి గిరిజనులకు చేయూత అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, ఏపీ ఓ పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, డి ఈ హరీష్, మేనేజర్ ఆదినారాయణ, జిసిసి మేనేజర్ జయరాజ్, మ్యూజియం ఇన్చార్జి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం అల్లర్ల అడ్డాగా మారుతోందా..?

- పోలీస్ శాఖ 'అన్ ఫిట్' అంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు
- ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై దాడి – రౌడీయిజానికి నిదర్శనం
- నూతన నాయకుల అండతో కొట్లాటలకే సై అంటున్న యువత







**కొత్తగూడెం, మార్చి 27 (ప్రజాజ్యోతి )** కొత్తగూడెంలో వరుసగా చోటుచేసుకుంటున్న దాడులు, రోడ్లపై బహిరంగ కొట్లాటలు కొత్తగూడెం పట్టణాన్ని అల్లర్ల అడ్డాగా మార్చుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా పట్టణ కేంద్రంలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై జరిగిన దాడి ఘటన కేవలం ఒక్క సంఘటన మాత్రమే కాకుండా రోజురోజుకు పెరుగుతున్న రౌడీయిజానికి స్పష్టమైన ఉదాహరణగా వ్యాపారవేత్తలు పేర్కొంటున్నారు. స్వార్థపూరిత రాజకీయ నాయకుల అండదండలతో యువత కొట్లాటల దారిలో నడుస్తోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా చిన్నచిన్న విషయాలకే గుంపులుగా మారి దాడులు చేయడం సాధారణమైపోయిందని ఆరోపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అనేక కొట్లాటలతో పాటు సిగరెట్ కోసం యువకుడి దారుణ హత్య లాంటి ఘటనలు కండ్ల ముందు కనిపిస్తున్నప్పటికి కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. ఇదే ధోరణి కొనసాగితే కొత్తగూడెం లో మర్డర్లు కూడ జరిగే అవకాశలు కనిపిస్తున్నాయి.

### నాయకుల అండదండలే హింసకు మూలమా..?

కొంతమంది నూతన రాజకీయ నాయకులు తమ ప్రభావాన్ని చూపించేందుకు యువతను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మన వెనుక నాయకులు ఉన్నారులే అనే ధైర్యంతో చట్టాలపై భయం లేకుండా ప్రవర్తిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. రాజకీయాల పేరుతో గుంపులు ఏర్పడి ప్రత్యర్థులపై దాడులు చేయడం కొత్త సంస్కృతిగా మారిందని విమర్శిస్తున్నారు.

### కొత్తగూడెంలో పోలీస్ వ్యవస్థ వైఫల్యం..?

కొత్తగూడెం పట్టణంలో వరుస ఘటనలు జరుగుతున్నప్పటికీ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. నేరాలు జరిగిన తర్వాతే స్పందించడం వల్ల పరిస్థితులు అదుపు తప్పుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత మంది రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగా కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు వెనుకంజ వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనితో పోలీసులు ఉన్నా లేకపోయినా ఒకటే అన్న భావన ప్రజల్లో పెరుగుతోంది. రోడ్లపై బహిరంగంగా గొడవలు, దాడులు జరుగుతున్నప్పటికీ ఎవరూ భయపడకపోవడం పరిస్థితి ఎంత దారుణంగా మారిందో చూపిస్తోంది. కొట్లాట అంటేనే భయం లేదు అనే స్థాయికి పరిస్థితులు చేరుకున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కొత్తగూడెం కేంద్రంగా పెరుగుతున్న అశాంతి

ప్రస్తుతం కొత్తగూడెం రాజకీయ ఉద్రిక్తతలకు, గుంపుల ఘర్షణలకు కేంద్రంగా మారుతోందనే అభిప్రాయం బలపడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా జోక్యం చేసుకుని చట్టాన్ని అమలు చేయకపోతే భవిష్యత్తులో పరిస్థితులు మరింత విషమించే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమేఅన్న భావనను కఠినంగా అమలు చేయాలని రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు





**భద్రాచలం, మార్చి 27, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకాటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మంత్రులతో కలిసి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి, మంత్రులకు వైదిక బృందం వేద ఆశీర్వచనం అందజేశారు.

## భద్రాద్రిలో భారీగా ట్రాఫిక్ జామ్

- ట్రాఫిక్ నిర్వహణలో పోలీసు శాఖ విఫలం





**భద్రాచలం, మార్చి 27, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణానికి భారీగా భక్తులు రావడంతో కార్లు, జీపులు, వ్యాన్లు, బస్సు లతో భారీగా రావడంతో కిలో మీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అయ్యింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపివేసి కల్యాణంను వీక్షించేందుకు వెళ్లారు. దీంతో ఉదయ భాస్కర్ రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వాహనాలు నిలిచిపోయాయి. అలాగే . సీఎం కాన్వాయ్ రావడంతో కొద్దిసేపు వాహనాలు కూడా పోలీసులు నిలిపివేయడంతో ట్రాఫిక్ రద్దీ మరింతగా పెరిగింది. మళ్లీ సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో రెండు బ్రిడ్జిలపై తిరుగు ప్రయాణంలో వాహనాల ట్రాఫిక్ సమస్యతో పోలీసులు సైతం ట్రాఫిక్ పునరుద్ధరణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు శాఖ సరైన విధంగా వ్యవహరించలేదని భక్తులు వాపోతున్నారు. పట్టణంలోని రోడ్లన్నింటిని సీఎం బందోబస్తు పేరుతో ఇష్టానుసారం బారికేడ్లు ఏర్పాటు చేసి నియంత్రించడంతో ప్రధాన రహదారుల్లో వాహనాలు వెళ్లక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- దక్షిణ అయోధ్యలో దివ్య దాంపత్య దృశ్యం
- కనువిందైన సీతారాముల కళ్యాణ వైభవం
- సాంప్రదాయ బద్ధంగా ముగిసిన కళ్యాణ తంతు
- ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు
- రూ.351 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వేడుకలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, పలువురు రాష్ట్ర మంత్రులు
- భక్తులతో పోటెత్తిన భద్రగిరి
- భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



# అభిజిత్ లగ్నంలో... ఆధ్యాత్మిక వైభవం

**"ఆకాశమంత పందిరి... భూదేవంత మండపం... వేదగోషల నాదం... జయజయ ధ్వానాల హోరు..." అన్నట్లుగా భద్రాద్రి నేడు ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఉప్పొంగింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన ఈ పుణ్యక్షేత్రంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తజన హృదయాలను పరవశింపజేసింది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా అభిజిత్ లగ్నంలో శ్రీరాముడు సీతమ్మవారిని పరిణయం మాడగా, "జై శ్రీరామ్" నినాదాలతో భద్రగిరి మార్మోగింది. కనులారా తిలకించిన ఈ దివ్య ఘట్టం భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచింది.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 27 (ప్రజాజ్యోతి):** "ఆకాశమంత పందిరి... భూదేవంత మండపం... వేదగోషల నాదం... జయజయ ధ్వానాల హోరు..." అన్నట్లుగా భద్రాద్రి నేడు ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఉప్పొంగింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన ఈ పుణ్యక్షేత్రంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తజన హృదయాలను పరవశింపజేసింది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా అభిజిత్ లగ్నంలో శ్రీరాముడు సీతమ్మవారిని పరిణయం మాడగా, "జై శ్రీరామ్" నినాదాలతో భద్రగిరి మార్మోగింది. కనులారా తిలకించిన ఈ దివ్య ఘట్టం భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచింది. మిథిలా ప్రాంగణంలోని శిల్పకళా శోభిత మండపంలో సాంప్రదాయబద్ధంగా కళ్యాణ తంతు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవలతో ప్రారంభమైన కార్యక్రమాల్లో అర్చక స్వాములు అభిషేకాలు నిర్వహించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి కళ్యాణ వేదికపై ఆసీనులను చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కన్యాదానం వంటి తంతులు నిర్వహించిన అనంతరం అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం కార్యక్రమం నిర్వహించారు. జనక మహారాజు, దశరథ మహారాజు తరఫున రెండు, భక్త రామదాసు సమర్పించిన మరొకటి కలిపి మూడు మంగళసూత్రాలతో మాంగల్యధారణ జరిపారు. అనంతరం తలంబ్రాల తంతు భక్తులను ఆకట్టుకుంది. దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో భద్రాచలం కిక్కిరిసింది. గోదావరి తీరం భక్తజన సందడితో కళకళలాడగా, రామాలయ పరిసరాలు జన సందోహంతో నిండిపోయాయి. కళ్యాణం అనంతరం భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయగా, స్థానికులు అన్నదానం, పులిహోర, పానకం, మజ్జిగ, మంచినీళ్లు అందజేశారు.





››› పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం...





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీసమేతంగా భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలానికి చేరుకున్న ముఖ్యమంత్రి తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.351 కోట్లతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి తొలి విడత పనులకు భూమిపూజ నిర్వహించారు. తరువాత మిథిలా ప్రాంగణానికి చేరుకుని సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనం కృష్ణదొర, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటిడిఏ పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఊరంతా అన్నదానం....పానకం మజ్జిగ, వడపప్పు పంపిణీ

- భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులు




**భద్రాచలం టౌన్ మార్చి 27 , ప్రజాజ్యోతి** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం విచ్చేసిన అశేష భక్తకోటికి భద్రాచలంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులు, కార్పోరేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు సేవలందించారు. పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో అన్నదానం చేయడంతో పాటు మజ్జిగ, తాగునీరు, బెల్లం పానకం, పాలు పంపిణీ విస్తృతంగా పంపిణీ చేశారు. అలాగే యుబీ రోడ్డు, సూపర్‌బజారు సెంటర్, రాజుల సత్రం, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం, కల్కి, సేవా సమితి, మార్కెట్ వర్తక సంఘం, అంబేద్కర్ సెంటర్తో పాటు పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. దీంతో వేలాది మంది భక్తులు అన్నదాన కేంద్రాల వద్ద బారులు తీరారు. ప్రభుత్వం భక్త లకు ప్రభుత్వం తరపున అరకొర ఏర్పాట్లు చేసినా స్వచ్ఛంద సంస్థలు మాత్రం భక్తులకు విశేష సేవలందించి వారి ప్రశంసలు పొందాయి. రామ భక్తులకు వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు పులిహోర పంపిణీ చేశారు.

## సంఘాల పేరుతో...

# సెటిల్మెంట్ బిజినెస్..?

- మహిళా నేతలే సెటిల్మెంట్ బ్యాచ్ గా మారుతున్నారా?
- బాధితులను బెదిరించి ఒప్పందాలకు దింపే కొత్త ముఠాలు కొత్తగూడెం సిటీలో
- సెటిల్మెంట్ గుంపుల చర్యల వల్ల మొత్తం సంస్థల ప్రతిష్ట దెబ్బతింటోందా..!



**చుంచుపల్లి , మార్చి 27 ( ప్రజాజ్యోతి )** సంఘాల పేరుతో సామాజిక సేవ చేయాల్సిన కొంతమంది మహిళా నేతలు ఇప్పుడు సెటిల్మెంట్ బ్యాచ్ గా మారుతున్నారన్న ఆరోపణలు కొత్తగూడెంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు వంటి సున్నిత అంశాల్లో జోక్యం చేసుకుని బాధితులను బెదిరిస్తూ సెటిల్మెంట్లకు ఒత్తిడి తెస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా జరిగిన తాజా ఘటనలో కొంత మంది మహిళా సంఘ నేతలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని వివాదంలో ఒక పక్షానికి మద్దతుగా నిలుస్తూ బాధిత కుటుంబాన్ని మానసికంగా ఒత్తిడికి గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సంఘం ( కొన్ని సంస్థల ) పేరును అడ్డంగా పెట్టుకుని చట్టపరమైన ప్రక్రియలను పక్కన పెట్టి తాము చెప్పినట్టే సెటిల్మెంట్ చేసుకోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని బాధితుల ఆరోపిస్తున్న ఘటనలు వినిపిస్తున్నాయి.

కొన్ని సంస్థలు జారీ చేసే ఐడి కార్డులను మహిళా నేతలు మెడలో ధరించి తామే అధికారులమని చెప్పుకుంటూ బాధితుల ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు జారీ చేస్తున్న ఘటనలు అక్కడక్కడ చోటు చేసుకుంటున్నాయి. వివాదాలను పరిష్కరించాలంటే ముందుగానే డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ సెటిల్మెంట్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొన్ని మహిళా సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు నిజంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయడానికి కృషి చేస్తున్నప్పటికీ మరికొందరు సెటిల్మెంట్ గుంపుల చర్యల వల్ల మొత్తం సంస్థల ప్రతిష్ట దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› కుల సంఘాల పేరుతో బెదిరింపుల రాజకీయం..?

బాధితుల ఆరోపణల ప్రకారం కొంత మంది మహిళా నేతలు కుల సంఘాల పేరును ఉపయోగించి మా కులానికి చెందినవారికి న్యాయం చేయాలి అంటూ భావోద్వేగాలను రెచ్చగొడుతూ ప్రత్యర్థి వర్గాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. వారు చెప్పిన మాట వినకపోతే ఎస్సీ/ఎస్టీ చట్టాలను ఉపయోగించి కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేస్తున్న ఘటనలు ఉంటునాయన్న వదంతులు వస్తున్నాయి. ఈ విధానం వల్ల అసలు బాధితుల సమస్య పరిష్కారం కాకుండా వివాదాలు మరింత ముదురుతున్నాయని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. చట్టపరమైన మార్గం ఉన్నప్పటికీ బలవంతపు సెటిల్మెంట్లకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తలెత్తుతున్నాయి.

### ››› సెటిల్మెంట్ పేరుతో నిలువు దోపిడీ..?

సంఘాల పేరుతో జోక్యం చేసుకుంటున్న కొందరు నేతలు అనుకోని సంఘటనల వలన చోటుచేసుకునే వివాదాలను ఆదాయ వనరుగా మార్చుకున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బాధితుల బలహీన పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఒత్తిడితో సెటిల్మెంట్లు జరిపించి లాభాలు పొందుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక సేవ అనే ముసుగులో జరుగుతున్న ఈ సెటిల్మెంట్ వ్యవహారాలపై సమగ్ర విచారణ అవసరమని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› అధికారులు జోక్యం చేసుకుంటారా..?

సంఘాల పేరుతో జరుగుతున్న ఈ విధమైన అనధికార జోక్యాలు భవిష్యత్తులో పెద్ద సామాజిక సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కుల భావోద్వేగాలను రెచ్చగొట్టి సెటిల్మెంట్లు చేయడం వల్ల సామాజిక ఐక్యత దెబ్బ తినే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సంఘాల పేరుతో సెటిల్మెంట్లు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పాల్వంచలో కళ్యాణం_ కమనీయం_ రమణీయం

- భజన మందిరం రామాలయంలో వైభవోపేతంగా సీతారాముల కళ్యాణం
- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన పాల్వంచ పట్టణం
- సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని
- వాడ వాడలా బెల్లం, పానకం_ మజ్జిగ పంపిణీ





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 27,ప్రజా జ్యోతి:** శ్రీరామనవమి సందర్భంగా పాల్వంచ పట్టణంలోని పలు దేవాలయాలలో సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు, కళ్యాణం సందర్భంగా ప్రతి ఆలయాన్ని మామిడి తోరణాలతో వివిధ రకాల పూలతో అలంకరించి అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణాన్ని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు, ముఖ్యంగా పాల్వంచ శాస్త్రి రోడ్లో గల శ్రీ సీతారామచంద్రస్వామి భజన మందిరం లో సీతారాముల కళ్యాణం శోభాయమానంగా జరిగింది, కళ్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చి జైశ్రీరామ్ అంటూ చేసిన నినాదంతో కళ్యాణమండపం మార్మోగింది, ఆలయ కార్య నిర్వహణ అధికారి నండూరి రజిని కుమారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టగా గత భజన మందిరం కమిటీ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, కిషోర్ ,శ్వేతా ప్రకాష్ , కొప్పరపు సత్యనారాయణ, రాము పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు, తదితరుల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఆలయంలో నూతన రాజగోపురం, ఇతర మూడు గోపుర ప్రాకారాలకు కలశ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కళ్యాణం ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణానికి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సీతారామచంద్ర స్వామి వారికి పట్టు వస్త్రాలను తీసుకొచ్చి అందజేశారు, అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ అర్చకులు ఆనంద శర్మచార్యులు, వంశీ చార్యులు శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, మాజీ డిసిసిబి డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్ రావు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు, అదేవిధంగా పాల్వంచ పట్టణంలోని గుడిపాడు గ్రామంలో గల మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్యామల గోపాలం ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లారి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు అందించగా వేటచెరువు గ్రామానికి చెందిన ఆరెమ్ ప్రశాంత్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, నవభారత్ సంజయ్ నగర్ కాలనీలోని రామాలయంలో, బొల్లూరు గూడెం, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గల రామాలయం లలో సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు, అదేవిధంగా పట్టణంలోని పలు డివిజన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాల వద్ద సీతారాముల కల్యాణాన్ని ఆయా డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు, కళ్యాణం సందర్భంగా భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాలలో బెల్లం, పానకం, మజ్జిగ ,ప్రసాదాలను పంపిణీ చేశారు,





# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

- సారె సమర్పణలో పళ్ళు, పూలు, గాజులు, నైవేద్యాలతో మహిళా భక్తుల విశేష స్పందన
- మహా అన్నదానానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వీకరణ





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 27, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి మహిళా భక్తులు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం తో రణపాకుతో కట్టడం ద్వారా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించి తమ భక్తిని వ్యక్తం చేశారు. స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా సంప్రదాయ వివాహ తంతులు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి జిలకర బెల్లం కార్యక్రమం నిర్వహించి, దాంపత్య ఐక్యతకు ప్రతీకగా ఆ తంతు జరిపారు. అనంతరం కంఠ బంధనం, మంగళసూత్రధారణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించగా, భక్తులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ తంతులో వరుడు–వధువు రూపంలో స్వామివారికి తలంబ్రాలు సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా మహిళా భక్తులు సారె సమర్పణలో భాగంగా పళ్ళు, పూలు, గాజులు, నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు పానకం భక్తులకు అందజేయగా, చాలా మంది భక్తులు విశేషంగా తీర్థాన్ని స్వీకరించి స్వామివారి మహా ప్రసాదంగా స్వీకరించారు. కార్యక్రమాల అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదానాన్ని గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నిర్వహించడం జరిగినదని రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులతో పాటు రామాలయ బృంద భక్తులు, గ్రామ సేవకులు, యువత పాల్గొని అన్నదానాన్ని విజయవంతం చేశారు. రామాలయం కమిటీ సభ్యులు సురేష్, నాగళ్ళ నరసింహారావు, ఇజ్జగిరి సత్యనారాయణ, శ్యామ్, చిల్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. వారి సమన్వయంతో కళ్యాణ మహోత్సవం విజయవంతంగా జరిగింది.

## గోదావరి నదిలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన డిడిఆర్ఎఫ్ బృందం



**భద్రాచలం టౌన్, మార్చి 27, ప్రజాజ్యోతి** భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా గోదావరి వద్ద స్నానానికి వెళ్లిన హైదరాబాద్ కి చెందిన ఉదయ్ అనే యువకుడు ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడటం జరిగింది. ఆ సమయంలో అక్కడే విధులలో ఉన్న డీడిఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు వెంటనే స్పందించి బాదితుడిని రక్షించి ఆంబులెన్స్ లో హాస్పటల్ కి పంపడం జరిగింది. ఆపదలో ఉన్న వారిని సంరక్షించడానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడటంతో అక్కడే ఉన్న స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన డిడిఆర్ ఫ్ బృంద సభ్యులైన ఆరెఎస్సె సుమంత్, కానిస్టేబుళ్ళు రమేష్, వినోద్ కుమార్, రాజేష్, ఫరీద్ బాబు, జమలయ్య, సాయి ఫణింద్ర, అనిల్ కుమార్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మేవా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ, ప్యాకెట్లు పంపిణీ




**బూర్గంపహాడ్ జనవరి 27 (ప్రజాజ్యోతి):** సామాజిక సామరస్యానికి నిదర్శనం ఈ సేవా కార్యక్రమమని సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ అన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి వస్తున్న భక్తులకు బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల భక్తులకు క్వింటా పులిహోర ప్యాకెట్లు 3000 వేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సార పాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమం కేవలం పులిహోర, మజ్జిగ పంపిణీ మాత్రమే కాకుండా హిందూ-ముస్లిం సామాజిక సామరస్యానికి ఓ బలమైన సంకేతంగా నిలిచిందని అన్నారు. సారపాక ప్రాంతం ముస్లిం సోదరులు కుల, మతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టటం అభినందించవలసిన విష యమని అన్నారు. మేవా చేస్తున్న సేవా కార్యక్రమలు గతంలో తాను చూసానని, కమిటీ సభ్యులను ముస్లిం సోదరులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, మేవా కమిటీ సభ్యులు మహమ్మద్ ముస్తఫా, షేక్ జహీర్ పాషా, అజీమ్, అబ్దుల్ స లీం, హఫీజ్, అక్బర్, సోహెల్ పాషా, యూసు ఫ్, అజీజ్. రెహమాన్. తదితరులు పాల్గొన్నారు.

## పండగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి

- నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 27, ప్రజాజ్యోతి:** భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని నేతాజీ యువజన సంఘం, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ అన్నారు. శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు, ఉత్సవాలను ఐక్యమత్యంతో జరుపుకోవడం ద్వారా మానవ సంబంధాలు మరింత బలపడతాయని అన్నారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నేటి యువత కులమత భేదాలను విడనాడి, అందరితో స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు ఏవి రాఘువ, ఓం ప్రకాష్, రామినాయుడు, పి.ప్రసాద్, జిల్లేపల్లి స్టాలిన్, సయ్యద్ అంజద్, సిద్ధా రెడ్డి, వేలాద్రి, సయ్యద్ నూర్జహాన్ పర్వీన్, టి.వరలక్ష్మి , సక్కుబాయి, విజయ, మదీనా, ప్రవళిక, పాల్గొన్నారు.

## అన్న ప్రసాదానికి రూ.20,116 విరాళం

- ఎన్ఆర్ఐ నిత్య శ్రీ సేవాభావం





**పినపాక, మార్చి 27(ప్రజాజ్యోతి):** శ్రీరామ నవమి పురస్కరించుకుని పినపాక మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన మహా అన్నప్రసాదం (అన్నదానం) కార్యక్రమానికి ఎన్ఆర్ఐ కుమారి నిత్య శ్రీ రూ.20,116 విరాళంగా అందజేశారు. పినపాకకు చెందిన సీనియర్ పాత్రికేయులు కొత్త దామోదర్ గౌడ్, శ్రీలత దంపతుల పెద్ద కుమార్తె అయిన నిత్య శ్రీ విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్వగ్రామంపై ప్రేమతో ఈ సేవా కార్యక్రమానికి సహకరించడం ప్రశంసనీయమని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా నిత్యశ్రీ ని గ్రామ పెద్దలు ఆశీర్వదిస్తూ, శ్రీరాముని కృపతో ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిత్య శ్రీ తాత చిర్రా రాములు, అమ్మమ్మ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## రమణీయం. రాముని కళ్యాణం



**గుండాల. మార్చ్. 27. ప్రజా జ్యోతి.** శ్రీరామ నవమి సందర్భంగా మండల కేంద్రంలో రామాలయం ముందు రాముని కళ్యాణం కన్నుల పండుగ జరిగింది శుక్రవారం గుండాల మండల కేంద్రంలోని రామాలయం ముందు శ్రీరాముని కళ్యాణం ఘనంగా జరిగింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాములు కళ్యాణ్ అని తిలకించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం మండల కేంద్రంలోని పురవీధుల్లో ద్విచక్ర వాహనాలతో భక్తులు ర్యాలీ నిర్వహించారు. దేవాదాయ కమిటీ చైర్మన్ తిరు కొల్లూరి వెంకటేశ్వర్లు (పట్వారి వెంకన్న) మాజీ అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు కార్యదర్శి వ్యవసారపు సురేష్ కోశాధికారి కోడూరి శ్యామ్ , సభ్యులు బత్తిని సాయన్న, గుండెబోయిన లక్ష్మీనారాయణ, పిల్లి కృష్ణ, మాచర్ల వంశీ, మానా ల ఉపేందర్, గడ్డం సాయి, ఇల్లందుల అప్పారావు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## రాములోరి సేవలో సింగరేణి

- భద్రాచలంలో భక్తులకు మజ్జిగ, వాటర్ బాటిల్స్ పంపిణీ



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 27 – ప్రజాజ్యోతి:**బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదనలో మరింత బిజీ గా ఉన్న సింగరేణి సంస్థ సేవా కార్యక్రమాలు కూడా ముందుంటుందని మరోసారి నిరూపించింది. భద్రాచలంలో శుక్రవారం జరిగిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తుల సేవలో సింగరేణి సంస్థ తమ సేవలు అందించి భక్తి భావాన్ని చాటుకుంది. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ కంపనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సంధర్భముగా శుక్రవారము నాడు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ వేడుకకు విచ్చేసిన వేలాది భక్తులకు ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని మంచినీరు మరియు మజ్జిగ పాకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డైరక్టర్ ( ఆపరేషన్స్ )ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పి&పి) కే.వెంకటేశ్వర్లు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్య , ఇతర అధికారులు పాల్గొని సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు ఘనస్వాగతం



**బూర్గంపహాడ్, మార్చి 27 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ బీపీఎల్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ లో హెలీకాప్టర్ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కుటుంబ సభ్యులు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు శుక్రవారం చేరుకోవడంతో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖలతో పాటు జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ కు ఘన స్వాగతం పలికారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి ఉదయం 10.42 గంటలకు హెలికాప్టర్ దిగారు. అనంతరం ఐటీసీ గెస్ట్ హౌస్ కు చేరుకుని 10.50 గంటలకు సారపాక నుంచి భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి రోడ్డు మార్గాన కాన్వాయిలో తరలివెళ్లారు. అనంతరం కల్యాణ తంతు ముగించుకుని అక్కడ ఆలయ అభివృద్ధి పనుల కార్యక్రమంలో పాల్గొని తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు సారపాకలో హెలీప్యాడ్ వద్దకు చేరుకోగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల వీడ్కోలు పలకగా హెలీకాప్టర్లో హైదరాబాద్ కు తిరుగు పయనమయ్యారు.

## శ్రీరామనవమి వేడుకల్లో బసవతారక కాలనీ యువత సేవా స్ఫూర్తి

- రాపోలు ఆనంద్, ఆకుల హరికృష్ణ ఆధ్వర్యంలో యువత సేవ కార్యక్రమం

**పాల్వంచ, మార్చి 27, ప్రజాజ్యోతి:** శ్రీరామనవమి వేడుకల సందర్భంగా బసవతారక కాలనీ ఆధ్యాత్మిక వాతావరణంతో పరిమళించింది. అయోధ్యను తలపించేలా ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.కళ్యాణ కార్యక్రమం కొనసాగుతున్నంతసేపు భక్తులు "రామ రామ" నామస్మరణతో భక్తి పరవశానికి లోనయ్యారు. మరోవైపు కాలనీ యువత విశేష సేవా కార్యక్రమాన్ని చేపట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.భద్రాచలం–కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన స్టాల్ ఏర్పాటు చేసి భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. రహదారిపై ప్రయాణిస్తున్న భక్తులు, వాహనదారులను ఆపి స్వామివారి ప్రసాదంతో పాటు పానకం, మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.అదే సమయంలో భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఇంతకుముందు ఎప్పుడూ చూడని విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన బసవతారక కాలనీ యువతను స్థానికులు అభినందించారు.ఈ వేడుకల్లో యువత చూపిన సేవాభావాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు.ఈ కార్యక్రమంలో రాపోలు ఆనంద్, ఆకుల హరికృష్ణ , రాపోలు శ్రీశైలం, నూకల రాజ్ కుమార్, నూకల అఖిల్, నూకల ప్రేమ్ కుమార్, సంతోష్, ప్రశాంత్, రవి , కుషాల్ కుమార్, లీలాకృష్ణలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# వైభవంగా సీతారాముల కళ్యాణం





**చర్ల, మార్చ్ 27:(ప్రజా జ్యోతి ):**చర్ల మండల వ్యాప్తంగా శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా మండలంలోని వైష్ణవ దేవాలయాలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయిల్ బంక్ ఏరియా లోని మారుతీ నగర్లో అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో, పాత చర్ల సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో, ఆర్ కొత్తగూడెం, లింగాపురం,కొత్తూరు రామాలయాలలో శ్రీరామనవమి వేడుకను అత్యంత కన్నుల పండుగలా నిర్వహించారు. ఆయిల్ బంకు ఏరియా లోని మారుతి నగర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం రాత్రి ఎదురుకోలు ఉత్సవంను ఘనంగా నిర్వహించి శుక్రవారం ఉదయం సీతారామచంద్ర స్వామి వారికి సారే లను భక్తులు మేళ తాళాలతో ఆలయం వద్దకు తీసుకువచ్చారు. భక్తజనులతో అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మును అత్యంత కన్నుల పండుగలా నిర్వహించారు .మధ్యాహ్నం 12 గంటల పది నిమిషాలకు అభిజిత్ లగ్నంలో రాములవారి వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని భక్త జనులతో అభయాంజనేయ స్వామి వారి ఆలయము కిక్కిరిసినది భక్తులు శ్రీరామనవమి పూజా కైంకర్యాలను అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నులారా వీక్షించి రాముల వారి ఆశీస్సులను పొందారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు మజ్జిగ ,పానకం, వడపప్పు, పులిహోర ప్రసాదాలను అందజేయగా భక్తజనులు వాటిని స్వీకరించి ఆ సీతారామచంద్ర స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు అయ్యారు.

## కన్నుల పండుగుల శ్రీరామ నవమి వేడుకలు

- మండల వ్యాప్తంగా కనుల పండువగా స్వామివారి కళ్యాణం



**లక్ష్మీదేవిపల్లి మార్చి 27 ప్రజాజ్యోతి:** జగదభిరాముడు... శ్రీరాముడి కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజు ఉదయం 5 గంటల నుండి మండలంలోని అన్నాయి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభించి స్వామివారికి వేదమంత్రాలతో అభిషేకాలు, నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అధికారులు స్వామివారు ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక మండపాల్లో కూర్చుండ బెట్టి శాస్త్రోక్తంగా వివాహ వేడుకను జరిపించారు. లక్ష్మీదేవిపల్లి మండలం 31 గ్రామపంచాయతీలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు పెద్దలు ఉన్న ఆలయాల్లో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. శ్రీనగర్, సాటివారిగూడెం గ్రామపంచాయతీలలో ప్రత్యేకంగా బెల్లం పానకం మజ్జిగను భక్తులకు పంపిణి చేసారు.ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలతో శ్రీనగర్ కాలనీ పీహెచ్ఎసి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

## వాడవాడలా శ్రీసీతారాముల కల్యాణం

- జనసేన ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, పానకం, పులిహోర ప్యాకెట్లు పంపిణీ
- టీ టైమ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ





**బూర్గంపహాడ్, ఏప్రిల్ 27 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకుని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు, పూజారులు వైభవంగా... కన్నులపండువగా నిర్వహించారు. సారపాకలోని సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయం లో, శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో, శివాలయాలతో పాటు గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీరాంపురంలోని ఆంజనేయస్వామి, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, బూర్గంపహాడ్, సంజీవరెడ్డిపాలెం, మోరంపల్లిబంజర్ ఆలయాల్లో ఆలయకమిటీ నిర్వాహకులు శ్రీసీతారాముల కల్యాణాన్ని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్న సమయంలో స్వామి వారి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు సారపాకకు చెందిన జనసేన పార్టీ నాయకులు,వ్యాపార సంస్థలు, కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, పానకం, పులిహోర, మంచినీరు ప్యాకెట్లను అందించారు. దీంతో మండలంలో శ్రీరామనవమి వేడుకలతో సందడి వాతావరణం నెలకొన్నది.

## శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 27,ప్రజా జ్యోతి:** భద్రాచలం పుణ్యక్షేత్రంలో నేడు నిర్వహించనున్న శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ప్రతాప్ శుక్లా హాజరు కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో, ఎటువంటి లోపాలకు తావు లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సారపాకలో హెలిప్యాడ్ వద్ద గవర్నర్ స్వాగత ఏర్పాట్లు నుండి ప్రారంభించి, ఐటీసీ గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి, అనంతరం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దర్శనం, తదుపరి మిథిలా స్టేడియం లో మహా పట్టాభిషేక కార్యక్రమం, గిరి మార్ట్ ప్రారంభోత్సవం, తిరిగి ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భోజన ఏర్పాట్లు వంటి అన్ని కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.కార్యక్రమ ప్రదేశాల వద్ద పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని వీక్షించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

## జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో పులిహోర, పానకం మజ్జిగ మంచినీరు పంపిణీ




**బూర్గంపహాడ్,జనవరి27, (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాకలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవంనకు విచ్చేసిన భక్తులందరికీ భారతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో పులిహోర ,పానకం, మజ్జిగ, మంచి నీళ్లు ప్యాకెట్లు అందజేయడం జరిగినది.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారి కల్యాణ మహోత్సవమునకు భక్తులు సుదూర ప్రాంతాల నుండి రావడం జరుగుతుందని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో పులిహోర,పానకం,మజ్జిగ ప్యాకెట్లు ,మంచి నీరు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టీ వి వి నాగేంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ,జనరల్ సెక్రెటరీ విద్యాసాగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సురేష్‌వర్మ జిల్లా జనరల్ సెక్రెటరీ రామారావు, వైస్ ప్రెసిడెంట్ శివరాం ,సెక్రెటరీ దాసరి ప్రశాంత్ ,మహిళా సెక్రెటరీ తిరుపతమ్మ, రాజు శ్రీను రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మండల వ్యాప్తంగా కన్నుల పండువగా సీతారామ కళ్యాణ వేడుకలు





**టేకులపల్లి,మార్చి27,ప్రజాజ్యోతి:** మండల పరిధిలోగల గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవంను నిర్వాహకులు అత్యంత భక్తిశ్రద్ధలత,వైభవంగా జరిపించారు. రాముడు సీతమ్మను మనువాడే దృశ్యాన్ని గ్రామస్తులంతా కనులార తిలకించారు. పానకము,పులిహోర ప్రసాదాలను కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అందజేశారు.అన్నదానం కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్-హార్సింగ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్-ఉమా దంపతులు పాల్గొన్నా రు.శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, గోలియా తండా సర్పంచ్ లకావత్ నాకా నాయక్, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు కలిసి ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్ నాయక్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్యా దల్సింగ్ నాయక్,ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, బాలాజీ,జాలది అప్పారావు, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాడ వాడలా శ్రీ రాములోరి కళ్యాణం

**ఇల్లందు, మార్చి 27, ప్రజాజ్యోతి:** శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం ఇల్లందు పట్టణ, మండలంలో వాడ వాడలా శ్రీ సీతారామచంద్రుల కళ్యాణాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో శ్రీ సీతారామచంద్రుల కళ్యాణాన్ని వేద పండితుల వేదమంత్రోచ్చాలా నడుమ చేపట్టారు. పట్టణంలోని 24 ఏరియాలోని రామాలయంలో మాదాసు సుమన్, రాజా దంపతులు పీటలపై కూర్చొని శ్రీ సీతారామచంద్రుల కళ్యాణాన్ని నిర్వహించారు. అదేవిధంగా 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీలో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య స్వగృహం వద్ద భారీ సెట్టింగ్ తో శ్రీ సీతారామ కళ్యాణాన్ని భక్తుల నడుమ కనుల పండుగగా నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని 3,7,12,14,16,17 వార్డు కౌన్సిలర్లు, 13వ వార్డులో కాంగ్రెస్ నాయకుల ఆహ్వానం మేరకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మడుగు సాంబమూర్తి శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లందు పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ సీతారామ చంద్రులను వేడుకున్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.













## మతసామరస్యానికి నిదర్శనంగా బాలాజీ నగర్‌లో సీతారాముల కళ్యాణం

- . రామాలయం స్థలం వద్ద స్వామివారి పటంతో కళ్యాణ మహోత్సవం నిర్వహణ
- . ముస్లిం సోదరులకు సన్మానం, ఐక్యతకు నిదర్శనంగా కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 27, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని బాలాజీ నగర్‌లో రామాలయం కోసం కేటాయించిన స్థలం వద్ద స్వామివారి పటంతో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం హిందూ-ముస్లిం సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. రామాలయం స్థల ఏర్పాటుకు సహకరించిన ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారి సేవలను గుర్తించి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి కలగాలని కోరుకుంటూ, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లిం సోదరులు కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి బాలాజీ నగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రామ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ పెద్దలు, స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ఉత్సవం ద్వారా మతసామరస్య సందేశం ప్రజల్లో విస్తరించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో రామ భక్తులు, యువత సమిష్టిగా కృషి చేశారు. ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## శ్రీరామనవమి సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర మీసేవ సెంటర్‌లో ప్రత్యేక పూజలు



**పాల్వంచ, మార్చి 27, ప్రజాజ్యోతి:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బసవతారక కాలనీలోని శ్రీ విఘ్నేశ్వర మీసేవ సెంటర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినవి. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రామ నామస్మరణతో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామనవమి శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమం లో మీసేవ ప్రసాద్ , కొదువగంటి శ్రీనివాస్, రామకృష్ణ రెడ్డి, క్వాలిటీ కిరణ్, పాషా, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న రైతులు



**ఆళ్ళపల్లి.మార్చి27.ప్రజా జ్యోతి** మండల పరిధిలోని నడిమిగూడెం పంచాయతీ రైతులు వేసిన మొక్కజొన్న పంటలకు త్రీఫేస్ విద్యుత్ సరిగా లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆ గ్రామ రైతులు కొమరం బుచ్చిబాబు పాలెం సాయన్న సత్యనారాయణ నరసింహారావు వెంకటేశ్వర్లు కొమరం కార్తీక్ మధు రమేష్ బుర్రయ్య కొమరం నరసింహారావు గువ్వల నారాయణ బొమ్మల సత్యం కొమరం కృష్ణ పుల్లయ్య నాగేష్ లాలయ్య సీతారాములు సురేష్ పాయం వెంకన్న చిరంజీవి అంజిబాబు చంద్రం అని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జనవరి ఫిబ్రవరి నెలలో 24 గంటలకు కనీసం 19, 20 గంటలు త్రి ఫేస్ విద్యుత్ సరఫరా చేశారని గుర్తు చేశారు. కానీ మార్చి నెలలో పూర్తిగా త్రీఫేస్ విద్యుత్ కోతలతో కనీసం రెండు గంటలు మూడు గంటలు కూడా ఉండలేని పరిస్థితితో మొక్కజొన్నల పంటలు తీవ్రంగా ఎండిపోయి దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చరుచూపి ఈ నెల రోజులు పాటుగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా అయ్యేందుకు కృషి చేయాలని ముక్తకంఠంతో కోరారు.

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ప్రముఖులు



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 27,ప్రజా జ్యోతి:** శ్రీరామనవమి సందర్భంగా పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాధపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు ప్రత్యేకంగా భద్రాచలానికి వచ్చిన వచ్చిన సింగరేణి డైరెక్టర్ జి శ్రీనివాస్, హైదరాబాద్ నాంపల్లి హైకోర్టు జడ్జి జి శ్రీదేవి, తెలంగాణ హైకోర్టు జడ్జిలు జే శ్రీనివాసరావు, శేషగిరిరావు, ఆంధ్రప్రదేశ్ జడ్జి కిరణ్మై, లు పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో రజనీకుమారి, ధర్మకర్త మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వారికి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు

# పందెం నీదా.. నాదా.. సై..!

- -ఐపిఎల్ బెట్టింగ్ షురూ -జిల్లాలో గుట్టుగా సాగనున్న బెట్టింగ్ లు
- -బెట్టింగ్ లో మునిగిపోతున్న యువత
- -ఆర్థికంగా కుదేలు అవుతున్న వైనం
- -పట్నం నుంచి పల్లెలకు పాకిన బెట్టింగ్ భూతం!
- -మాఫియా చేతుల్లో బుగ్గిపాలవుతున్న వారెందరో!
- -కొందరికి వినోదం.. మరికొందరికి ఆర్థిక ఇబ్బందులు
- -10 జట్లు- 84 మ్యాచ్ లు
- -మే 24న ఫైనల్ మ్యాచ్
- -నేటి నుంచే ఐపిఎల్ క్రికెట్ ప్రారంభం



**ఇల్లందు, మార్చి 27, ప్రజాజ్యోతి:** మన దేశం, రాష్ట్రంలో క్రీడలకు ప్రాముఖ్యత ఉంది. వాటిలో ముఖ్యంగా ముఖ్యంగా క్రికెట్ అత్యంత వినోద క్రీడగా మారిందడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యుత్తమ క్రికెటర్లను దేవుళ్ళుగా కొలిచే అభిమానులకు మనకు కొదవలేదు. దేశవ్యాప్తంగా నిర్వహించే క్రీడలలో క్రికెట్ ఆదాయపరంగా కూడా మొదటి స్థానంలో ఉంది. టెస్టులు, వన్డేతో సాగుతున్న క్రికెట్ లో లేటుగా అడుగు పెట్టిన లేటెస్ట్ గా వండర్ క్రియేట్ చేసింది మాత్రం ఇండియన్ ప్రీమియర్ లీగ్. ప్రపంచవ్యాప్తంగా ఈ టోర్నీకి ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఐపీఎల్ కి సక్సెస్ రేటు తో పాటు ఆదాయ వనరులు కూడా ఎక్కువే... ఐపిఎల్ వస్తుందంటే చాలు అందులో పాల్గొనే ఆటగాళ్లతో పాటు ఆయా ఫ్రాంచెజీ లు, ప్రకటనలు అందించే ఏజెన్సీలలో ఉత్సాహం ఉరకలేస్తుంది. వీరుతో పాటు ఐపీఎల్ కోసం బెట్టింగ్ రాయులు బుకీలు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తూ ఉంటారు. యువతకు పరీక్షల కాలం ముగిసి ఖాళీగా ఉండే సమయంలో ఐపీఎల్ సీజన్ స్టార్ట్ అవడంతో యువకులు అధిక సంఖ్యలో బెట్టింగులు కాయడానికి సిద్ధపడుతుంటారు. రెండు నెలల పాటు నిరంతరాయంగా ఐపీఎల్ కు గిరాకీ మామూలుగా ఉండదు. ఈ మాయలో పడి ఎంతోమంది తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

### ››› పందాలు నిర్వహించే వారిని ఏమంటారు?




### ››› ఎలా నిర్వహిస్తారు?

పందెం నిర్వహించే వారిని బూకీలుగా పిలుస్తారు. మీరు కొంతమందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి దేశ, రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ముంబై, హైదరాబాద్ ప్రధాన బోర్డులు ఉండగా వాటికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి భీమవరం వంటి పట్టణాల్లో బోర్డులు ఏర్పాటు చేసుకొని మధ్యవర్తుల ద్వారా ప్లాంటర్ (పందెం కాసేవారు) తో నగదు లావాదేవులు కొనసాగిస్తారు. మధ్యవర్తులకు ఒక లక్ష పందెం కాసి గెలిస్తే రూ. ఐదు నుంచి రూ. 7 వేల వరకు కమిషన్ గా ఇస్తారు. ఒకవేళ ఆ టీం ఓడిపోయినా కానీ రూ. 2వేలు ఇవ్వడం జరుగుతుంది. ఇలా రెండు రకాలుగా లాభాలే. అందుకే మధ్యవర్తులు యువకులు, విద్యార్థులను టార్గెట్ చేసి ఈ కూపంలోకి లాగుతున్నారు. పట్టణంలో నుండి ఏజెన్సీ ప్రాంతాల లోని మారుమూల పల్లెల వరకు బోర్డులు ఏర్పాటు చేసి జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. క్రికెట్ పందాలు నిర్వహించేవారు కొంతమందికి డబ్బులు ఆశ చూపి ఈ కూపంలోకి నిదానంగా అడుగుపెట్టిస్తారు. మొదట సాఫీగా సాగే యువకుల బెట్టింగ్ వ్యవహారం చివరికి తమ బంగారు భవిష్యత్తు అప్పుల పాలే తిరిగి రాలనంతగా ఈ ఊబిలోకి నెట్టి వేయబడుతున్నారు.

### ››› జిల్లాలో రెచ్చిపోతున్న బెట్టింగ్ రాయుళ్లు

జిల్లాలో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ఐపీఎల్ బెట్టింగ్ రాయళ్ళ హవా కొనసాగుతుంది. రోజువారి కూలికి వెళ్లే పేదలను కూడా ఐపీఎల్ భూతం వదలడం లేదు. జిల్లాలో సుమారు నియోజకవర్గానికి 20 మంది నుంచి 25 మంది వరకు మధ్యవర్తులు ఉన్నట్లు సమాచారం. అవకాశమున్న ప్రతి ఒక్కరినీ టార్గెట్ చేయడం ఊబిలోకి దించడమే పనిగా వారు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మారుమూల చిన్న పల్లెల్లోనూ బెట్టింగ్ భూతం ఎగబాకిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సుమారు 150 మంది మధ్యవర్తులు ద్వారా జిల్లాలో రూ. కోట్లలోనే పందాలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. బెట్టింగులు పల్ల నష్టపోయిన వారి పరిస్థితి దారుణంగా తయారవుతుంది. అరికట్టాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఎందుకు వివరిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు బెట్టింగ్ నిర్వహణపై గట్టి నిఘా ఏర్పాటు చేసి ఆ బెట్టింగ్ భూదానికి ఎవరు బలికాకుండా, ఆర్థికంగా నష్టపోకుండా, ప్రాణాలను కోల్పోకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## బెట్టింగ్ నిర్వహణపై నిఘా: తాటిపాముల సురేష్, సీఐ, ఇల్లందు



ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహణపై నిఘా ఏర్పాటు చేశాం. ఇల్లందులోని ప్రధాన సెంటర్లలో నిరంతరం గస్తీ ఏర్పాటు చేస్తాం. ఎవరైనా బెట్టింగ్ పాల్పడినట్లు తెలిస్తే మారుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్ కు బానిసలై ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడి ప్రాణాలను కోల్పోవద్దు. ఎవరైనా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ను ప్రోత్సహించే వారి సమాచారం పోలీసులకు తెలపాలి. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు నిరంతరం పనిచేస్తారు.